www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 08 (కాంప్లిమెంటరీ కాపీ) | మంగళవారం | 09.04.2024

మన చౌరాస్తా దినపత్రిక పాఠకులు, వీక్షకులు..వారి బంధు మిత్రులు, శ్రేయోభిలాషులకు..

# ఉగాది

## శుభాకాంక్షలు








## ఉప్పలంచి నరేందర్

సీనియర్ జర్నలిస్ట్, జనగామ

General News

# రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది

- భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగురవేయాలి
- సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్

**జనగామ, మన చౌరాస్తా :** భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎం.డి జహంగీర్ అన్నారు. పోరాటల అడ్డా భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జనగామ పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగాహాజరై మాట్లాడారు. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న ఈ సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చి, ఆ స్థానంలో మనుధర్మాన్ని తిసుకోచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశ పెట్టడం కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. దీని ద్వారా కుల, మత, ప్రాంత విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని మార్చడమే ధ్యేయంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ రద్దు, జ్యోతిష్యశాస్త్ర అమలు, విద్యా కాషాయికరణ, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, వారిని లొంగదీసుకోవడం, మేధావులను జైల్లల్లో పెట్టడం లాంటి వాటిని బలవంతంగా అమలు చేస్తుందన్నారు.

బీజేపీ గత ఎన్నికల ముందు రైతులను రెట్టింపు ధనవంతులను చేస్తామని చెప్పిందన్నారు. నల్ల డబ్బును బయటికి తీసి దేశ ప్రజల ఖాతాల్లో ప్రతి ఒక్కరికి 15 లక్షలు జమ చేస్తామని చెప్పిందన్నారు. ఆమాట ఎక్కడికి పోయిందోనన్నారు. మరోవైపు బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతికి చట్టబద్ధత కలిగించిందన్నారు. ఎలెక్ట్రోల్ బాండ్స్ రూపంలో 1,600 కోట్ల రూపాయల అవినీతి జరిగితే 800 కోట్ల రూపాయలు బీజేపీకి పార్టీకి చేరాయన్నారు.




సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గం ప్రజలందరికీ సీపీఎం చేసిన పోరాటాలు తెలుసునన్నారు. భువనగిరి పార్లమెంట్ ఏర్పడిన 2009 ఎన్నికల నుండి సీపీఎం పోటీ చేస్తుందన్నారు. అందుకే నిరంతరం నిజాయితీగా, నికరంగా, అవినీతికి తావులేకుండా ప్రజాసమస్యలపై పోరాడే సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండి జహంగీర్ పోటీ చేస్తున్నారని, అందుకు జనగామ నియోజకవర్గం ప్రజలు ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడే అభ్యర్థిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, పార్టీ సీనియర్ నాయకులు బోట్ల శ్రీనివాస్, ప్రజాసంఘాల జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశ్నించే వారికి పట్టం కట్టండి

**బచ్చన్నపేట :** ప్రజా సమస్యలపై చట్టసభలలో గళమెత్తే వ్యక్తికి ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టాలని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ అన్నారు. సోమవారం రోజున బచ్చన్నపేట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బచ్చన్నపేట మండల ఇన్చార్జి సుంచు విజేందర్ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రామగల్ల అశోక్, మండల నాయకులు అన్నబోయిన రాజు, పర్వతం, నర్సింలు, కడకంచి బాలరాజు, శోభ, తాడెం రాములు, పోచయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కూటమికి బుద్ధి చెప్పాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి

**స్టేషన్ఘన్పూర్, మన చౌరాస్తా :** మాయ మాటల కాంగ్రెస్ కూటమికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలి బిజెపి అభ్యర్థి అరూరి రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘన్ పూర్, చిల్పూర్, జఫర్ ఘడ్, ధర్మసాగర్ మండలాల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో 10 ఏళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాయ మాటలతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తుందని ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పదేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అందుకే ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ శత్రుదేశాలకు కంటిమీద కునుకులేకుండా చేసిన ఘనత నరేంద్ర మోడీది అన్నారు. దోచుకుని.. దాచుకుని దేశాన్ని లూటీ చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు దేశం నుంచి తరిమికొట్టబోతున్నారు అన్నారు. ఒక్కో కార్యకర్త సైనికుడిలా పనిచేసే బిజెపి విజయానికి, మోడీ మూడోసారి ప్రధానిగా నిలిపేందుకు కృషిచేయాలి అన్నారు. రోడ్లు, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, పల్లె దవాఖానలు, నీళ్లు, వంట గ్యాస్ మొదలైన అనేక సంక్షేమ పథకాలు పదేళ్ల మోడీ పాలనలో మారుమూల పల్లెలకూ చేరాయి అన్నారు. దేశం కోసం మోదీ పనిచేస్తున్నారు. మోదీ కోసం మనం పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పలువురు వివిధ పార్టీల నుండి బీజేపీ పార్టీలో చేరగా అరూరి రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, మాజి ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ రామరావు, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, అసెంబ్లీ కన్వీనర్ అంజిరెడ్డి, అసెంబ్లీ ప్రభారి మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొజ్జపల్లి సుభాష్, చిలుక విజయ రావు, ఇనుగాల యుగంధర్ రెడ్డి, ఐలోని అంజిరెడ్డి, గంటే ఉపేందర్, తోకల సమిరెడ్డి, ఉరడి రాజు, రడపాక ప్రదీప్, తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



## వడదెబ్బతో మహిళ మృతి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణానికి చెందిన ఓ మహిళ వడదెబ్బతో సోమవారం మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలో సంజయ్ నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) స్థానిక హోటల్‌లో రోజువారీ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. రోజువారి పనుల్లో రెండు రోజుల కింద ఎండలో నడుచుకుంటూ వెళ్లి వచ్చింది. సాయంత్రం వేళ డీహైడ్రేషన్‌కు గురై పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఇంటి వద్ద చికిత్స చేయించారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత పరిస్థితి విషమించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, నిర్మల కుమారుడు బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్ ఓ పత్రికలో జర్నలిస్టుగా పని చేస్తుండడంతో ఆమె కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎం.డి జహంగీర్, సీపీఎం లీడర్లు జోగు ప్రకాశ్, బుడిద గోపి, కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాంచందర్, జక్కుల అనిత, జిల్లాకు చెందిన జర్నలిస్టులు ఉన్నారు.



## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీవో




**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆర్డీవో డిఎస్ వెంకన్న సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి వేసవి తాపం నుండి ఉపశమనం కలిగేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎమ్మార్వైలు అర్జున్, రవీందర్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దారులతో స్వీప్ పై (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకన్న, ఏసిపి భీమ్ శర్మలు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామంలో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను సోమవారం ప్రారంభించారు. కడియం శ్రీహరి ఎంపీ నిధుల క్రింద రూ. 5 లక్షలు విడుదల చేయించగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ వివిధ కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ విజయకుమార్ గ్రామస్తుల చొరవ దాత ఇనుగాల చిత్తరంజన్ రెడ్డి, బాలవికాస సహకారంతో గ్రామ కమిటీగా ఏర్పాటుచేసి ప్లాంటును నేడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇనుగాల జోహార్ రెడ్డి, కుందూరు వెంకట్ రెడ్డి, గాండ్ల మల్లికార్జున్ వాటర్ ప్లాంట్ చైర్మన్ కనకం రమేష్, అధ్యక్షులు కత్తెరసాల సంజీవల తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

Local News

## వల్మిడి బ్రహ్మోత్సవాలను

# విజయవంతం చేయాలి



**జనగామ, మన చౌరాస్తా :** వల్మిడి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 23 వరకు జరిగే స్వామివారి ఆధ్యాయనోత్సవ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష కోరారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. 17న నిర్వహించే శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి



**జనగామ, మన చౌరాస్తా :** పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువత ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. సోమవారం ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ విచ్చేసి 86 మంది దరఖాస్తు చేసుకోగా మూడు నెలల కాల పరిధి శిక్షణ కార్యక్రమాలకు 55 మంది హాజరైనట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ శిక్షణ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ లో గ్రూప్ 1, ఆగస్టులో గ్రూప్ 2 పరీక్షలతో పాటు ఉపాధ్యాయ పరీక్ష లు ఉన్నందున పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న షెడ్యూల్ కులాల యువత అభ్యున్నతికి ఆర్థికంగా చేయూత అందివ్వాలని గొప్ప ఉద్దేశంతో భోజన వసతి తో కూడిన శిక్షణ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఏర్పాటు చేసినందున సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక ఇతరత్రా బ్యాంకు, స్టాఫ్ సెలక్షన్, బి హెచ్ ఈ ఎల్, ఎన్టీపీసీ, కోల్, వంటి ప్రముఖ సంస్థలలో ఉద్యోగాల కోసం ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. నిరంతరం శ్రమిస్తే గెలుపు మీదే అవుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి, అధ్యాపకులు, నిర్వాహకులు కవిత, సి.హెచ్. రామనర్సయ్య, ఆర్.అనిల్, వసతి గృహ సంక్షేమ అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఓటరుగా నమోదు చేసుకోవాలి

- **అడిషినల్ కలెక్టర్ రాధికా గుప్తా**

**హనుమకొండ, మన చౌరాస్తా :** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. సోమవారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచడంపై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి , జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, కేడిసి ప్రిన్సిపల్ రాజిరెడ్డి, డీఎల్పిఓ సుదర్శన్, ఎంపీఓ రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్ రావు, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ గెలుపు

# ఖాయమైంది

**వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య**

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట, గోరి కొత్తపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని... అది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేవలం మూడు నెలల పాలనలోనే తెలంగాణ రాష్ట్రంలో నిరూపితమైందని తెలిపారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలవడం, రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త ఒక సైనికునిగా పని చేయాలనీ సూచించారు.

పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలని, మోదీని చూసి ఓటు వేయమని ప్రజలను కోరుతున్న బీజేపీ నాయకులు.. మోదీ తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుడి పేరు, మతం పేరు చెప్పుకుని పబ్బం గడుపుకోవడమే బీజేపీ వాళ్ల పని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నాని, మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీగా అవకాశం కల్పిస్తే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాయంపేట, గోరి కొత్తపల్లి మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సరీలు, ఉపాధి హామీ

# పనుల పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల నర్సరీలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు అందించాలని, వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుట్టూ ఫెన్సింగ్ పకడ్బందీగా ఉండాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా తాగునీరు అందించే వనరులను ఆయన పరిశీలించి, సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా గుర్తించిన పనులను తనిఖీ చేసి, పక్కా ప్రణాళికతో మరమ్మతుల పనులను చేపట్టాలన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు.



# చెన్నై గ్రాండ్ విక్టరీ



- కోల్‌కతాపై 7 వికెట్ల తేడాతో విజయం
- చెలరేగిన చెన్నై బౌలర్లు
- కేకేఆర్ ను 137/9 కు కట్టడి
- స్వల్ప లక్ష్యాన్ని ఊదేసిన సీఎస్కే
- 17.4 ఓవర్లలో టార్గెట్ ఫినిష్




**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** చెన్నై సూపర్ కింగ్ మళ్లీ విజయాల బాట పట్టింది. సోమవారం కోల్ కతాతో జరిగిన మ్యాచ్ లో ఘన విజయం సాధించింది. కేకేఆర్ నిర్దేశించిన 138 టార్గెట్ ను 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఫినిష్ చేసింది. దీంతో 7 వికెట్లతో తేడాతో గ్రాండ్ విక్టరీని ఖాతాలో వేసుకుంది.

టాస్ ఓడి మొదటి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (34) టాప్ స్కోరర్. సునీల్ నరైన్ (27), రఘువంశీ (24) పరుగులు చేశారు. చెన్నై బౌలర్లు చెలరేగడంతో.. కేకేఆర్ కు పుంజుకునే అవకాశం రాలేదు. క్రమంగా వికెట్లు పడటంతో భారీ స్కోర్ వైపు బాటలు పడలేదు. వైవిధ్యమైన బంతులతో పిచ్ ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్న సీఎస్కే బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోర్ కు పరిమితం చేయడం లో సక్సెస్ అయ్యారు. చెన్నై బౌలర్లలో జడేజా 3, తుషార్ దేశ్‌పాండే 3, ముస్తాఫిజుర్ 2, తీక్షణ ఒక వికెట్ పడగొట్టారు.

ఇక 138 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన చెన్నై కి మంచి ప్రారంభం లభించింది. రచిన్ రవీంద్ర (15) త్వరగా అవుటైనా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67*) అర్ధ శతకంతో అదరగొట్టాడు. దీంతో 15 ఓవర్లకు 115/2 స్కోర్ తో చెన్నై పటిష్ట స్థితిలో నిలిచింది. డారిల్ మిచెల్ (25), శివమ్ దూబె(28) కీలక పరుగులు చేయడంతో సీఎస్కే విజయం నల్లేరు మీద నడకే అయింది. మరో 2.2 ఓవర్లు మిగిలి ఉండగానే 3 వికెట్లు కోల్పోయి చెన్నై ఘన విజయం సాధించింది. చెన్నై బౌలర్లు రాణించిన పిచ్ పై కోల్ కతా బౌలర్లు ఏమాత్రం రాణించకపోవడం గమనార్హం. కోల్ కతా బౌలర్లలో వైభవ్ రెండు వికెట్లు, సునీల్ నరైన్ ఒక వికెట్ పడగొట్టారు.

